

దళారులకు ధాన్యం విక్రయించొద్దు: డీఏవో

మక్కువ రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతుల ధాన్నాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని జిల్లా వ్యవసాయ శాఖాధికారి (డీఏవో) అన్నపూర్ణ సూచించారు. శుక్రవారం వెంకటభైరిపురంలో పర్యటించారు. ఆ ప్రాంతంలో ఆరబోసిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే గిట్టుబాటు ధరకు ధాన్యాన్ని విక్రయించి.. 24గంటల్లోనే నగదు పొందొచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలని సూచించారు. అన్నదాతల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

మత్తు వీడాలని..




● గంజాయి వ్యాపారం చేస్తూ పోలీసులకు, చట్టానికి దొరక్కుండా అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్నానని ఫొటోలోని మొదటి వ్యక్తి దర్జాగా కూర్చొని చెబుతున్నాడు. రెండో వ్యక్తి పోలీసులకు దొరికిన తరువాత లాయర్‌కు డబ్బులు ఇచ్చి బెయిల్ మీద బయటకు వచ్చానని, అమాయకులు ఇంకా జైలులోనే ఉన్నారని అంటున్నాడు. గంజాయి వ్యాపారం చేస్తున్నట్లు విచారణలో రుజువు కావడంతో సంపాదించిన ఆస్తులన్నీ కోల్పోయి పేదవానిగా మిగిలిపోయానని, జైలు జీవితం గడుపుతున్నానని మూడో వ్యక్తి వాపోతున్నాడు. వివిధ వేషధారులతో ఎస్.కోట పోలీసులు ఐదు రోజుల కిందట ఏర్పాటు చేసిన ప్రదర్శనిది. అందరినీ ఆలోచింపజేసింది.



● డ్రగ్స్ నివారణపై ప్రజల్లో అవగాహన కోసం పోలీసులు నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్ (ఎన్‌డీపీఎస్) టోల్‌ఫ్రీ నెంబర్ 1972 ఆకారంలో విద్యార్థులను నిల్చోబెట్టి ప్రదర్శన ఏర్పాటు చేశారు. తద్వారా చట్టం గురించి తెలుసుకోవడంతో పాటు టోల్ ఫ్రీ నంబర్‌ను సులువుగా గుర్తించుకుంటారనేది వారి ఆలోచన.

శృంగవరపుకోట/పార్వతీపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):

- యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు పోలీస్ శాఖ ప్రయత్నం
- గంజాయికి దూరంగా ఉండాలని సదస్సులో సూచనలు
- తాజాగా పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు సైకిల్ యాత్ర






గంజాయిని కట్టడి చేయడంతో పాటు యువతను సన్మార్గంలో నడిపించాలన్న సంకల్పంతో పోలీసులు వినూత్న పంథాలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఫ్లెక్సీలు పెడుతున్నారు. ర్యాలీలు చేపడుతున్నారు. తాజాగా విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టీ అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు అభ్యుదయం పేరుతో సైకిల్ యాత్ర చేపట్టారు. దారి పొడవునా గంజాయికి దూరంగా ఉండాలని, జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నారు.

వాస్తవానికి గంజాయి రవాణాపై ఇప్పటికే నిఘా పెంచారు. ఎప్పటికప్పుడు విస్తృతంగా (మిగతా 8వ పేజీలో..)

5న జిల్లాకు సీఎం?

- మంత్రి లోకేశ్ కూడా వచ్చే అవకాశం
- భామినిలో మెగా పీటీఎంకు హాజరు
- ఏర్పాట్లలో అధికారులు



పార్వతీపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లేదా విద్యాశాఖ మంత్రి లోకేశ్ వచ్చేనెల 5న జిల్లాలో పర్యటించనున్నారు. భామినిలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ (పీటీఎం) మీటింగ్‌కు వారు హాజరుకానున్నట్లు తెలిసింది. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందస్తుగా శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు భామినిలో ఆదర్శ పాఠశాలను సందర్శించారు. సంబంధిత అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు మంత్రి నారా లోకేశ్ పర్యటన దాదాపు ఖరారవగా.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సమావేశానికి హాజరవుతారా ? లేదా! అనేది మరో రెండు రోజుల్లో స్పష్టం కానుంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

శ్రేణులతో ప్రత్యేక సమావేశం

పాలకొండ నియోజకవర్గంపై టీడీపీ అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించినట్లు సమాచారం. ఈ మేరకు వచ్చే నెల 5న మంత్రి నారా లోకేశ్ భామిని మండలంలో పర్యటించిన అనంతరం పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. ఎవరు అవునన్నా.. కాదన్నా..పాలకొండ నియోజకవర్గంలోని టీడీపీలో రెండు బలమైన గ్రూప్‌లు ఉన్నాయి. ఇద్దరు బలమైన నాయకులు తెరవెనుక ఉండి ఆ గ్రూపులకు నాయకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం జనసేన పార్టీ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన తర్వాత టీడీపీలో చాలామంది నాయకులు, కార్యకర్తలు ఆయనతో నడవడం ప్రారంభించారు. మరికొంతమంది శ్రేణులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా భూదేవి వెంట ఉన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా మంత్రి లోకేశ్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. రెండు గ్రూపుల నాయకులు, కార్యకర్తలను ఒకేతాటిపైకి తెచ్చి.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం చేయనున్నట్లు సమాచారం.



కొలకలూరి ఇనాక్‌కు గురజాడ పురస్కారం

- రేపు ప్రదానం
- సమాఖ్య ప్రతినిధి ప్రకాష్ వెల్లడి

విజయనగరం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 30న గురజాడ వర్థంతి పురస్కరించుకుని జరిగే కార్యక్రమంలో కొలకలూరి ఇనాక్‌కు గురజాడ విశిష్ట పురస్కారం ప్రదానం చేస్తామని గురజాడ సమాఖ్య ప్రతినిధి కాపుగంటి ప్రకాష్ చెప్పారు. సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏటా గురజాడ వర్థంతి రోజున ఈ విశిష్ట పురస్కారం అందజేస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రముఖ సాహితీ వేత్త, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ వస్తున్నారని తెలిపారు. గురజాడ అభిమానులు, రచయితలు, సాహితీవేత్తలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్యూబీ టెక్ స్మార్ట్ సొల్యూషన్స్‌తో జేఎన్‌టీయూ ఒప్పందం 6లో

ఉత్తమ ఫలితాలు సాధించాలి

- విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు
- భామిని, సీతంపేటలో పర్యటన
- విద్యా ప్రమాణాలపై ఆరా



భామిని పాఠశాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ కమిషనర్

భామిని, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు అన్నారు. శుక్రవారం భామినిలో ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ ఏడాది ప్రవేశపెట్టిన సులభతరహా విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. గత ఏడాది టెన్త్, ఇంటర్మీడియట్ ఫలితాలను ప్రిన్సిపాల్ బాబూరావును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ల్యాబ్‌లు, ఆట పరికరాలు, తరగతి గదులు, నైపుణ్య శిక్షణ కేంద్రాలను పరిశీలించారు. విద్యాబోధన, సిలబస్‌పై విద్యార్థులతో ముచ్చటించారు. హిందీ పాఠాలు, సిలబస్‌లో మార్పులు, చేర్పులపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. బీఎఫ్ఎల్ఎన్ సర్వేపై ఆరా తీస్తూ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఇంకా ఏమైనా సమస్యలు న్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల క్రీడా మైదానాన్ని పరిశీలించారు.

గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

సీతంపేట రూరల్: గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యే కంగా దృష్టి సారించాలని విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు అన్నారు. శుక్రవారం సీతంపేట గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పరీక్షలను దృష్టిలో ఉంచుకొని చక్కగా చదువుకోవాలని సూచించారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ టెన్త్‌లో ఉత్తీర్ణులవ్వాలన్నారు. పాఠశాలలో

మెగా పీటీఎంకు ఏర్పాట్లు

వచ్చే నెల 5న భామినిలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు సీఎం చంద్రబాబు లేదా మంత్రి లోకేష్ వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందస్తు ఏర్పాట్లుతో సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే మోడల్‌స్కూల్ పరిసరాలను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పరిశీలించారు. శుక్రవారం విద్యాశాఖ కమిషనర్‌తో కలిసి మరోసారి సందర్శించారు.

వ్యాధులపై అప్రమత్తం: డీఎంహెచ్‌వో



ఉల్లిభద్ర పాఠశాలలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో

గరుగుబిల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందిని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశించారు. శుక్రవారం ఉల్లిభద్రలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలి. ఇళ్ల ముందు , మురుగు కాలువల్లో ప్లాస్టిక్ సామగ్రి లేకుండా చూడాలి. దోమల నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. ఎక్కడా మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలి. పల్లెల్లో మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు కాకూడదు. డ్రైడే వివరాలను విధిగా వీసీహెచ్ యాప్‌లో నమోదు చేయాలి.' అని తెలిపారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులు పరిశుభ్రతతో పాటు పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. ముస్తాబు కార్యక్రమం ఆవశ్యకతను తెలిపారు. ఆ తర్వాత సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. గర్భిణులు, బాలింతలు వివరాలను విధిగా నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, రక్తహీనతకు గురికాకుండా చూడాలని ఆదేశించారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేనా?

- జిల్లా కేంద్రంలో జటిలమవుతున్న సమస్య
- ప్రధాన రహదారిలో రాకపోకలకు అవస్థలు
- దీర్ఘకాలంగా వేధిస్తున్నా.. స్పందించే వారేరీ?

పార్వతీపురం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. ప్రధాన రహదారితో పాటు కూడళ్ల వద్ద రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడుతోంది. పట్టణం మధ్య నుంచి బైపాస్ రహదారి ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపవుతున్నాయి. ప్రధా నంగా భారీ వాహనాల రాకపోకల సమ యంలో పాదచారులు, వాహన చోదకులు కష్టాలు ఆ పైవాడికే ఎరుక. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో జిల్లాకేంద్రవాసులు నరకం చూస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

● సుమారు 30 ఏళ్ల కిందట అప్పటి జనాభా ప్రకారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బైపాస్ రహదారి నిర్మించారు. అయితే భవిష్యత్‌లో వాహనాల సంఖ్య పెరిగితే పరిస్థితి ఏమిటన్నది ఇంజనీరింగ్ అధికారులు ఆలోచించలేదు. పక్కనే ఉన్న బొబ్బిలి, సాలూరులో పట్టణాలకు వెలుపల నుంచి బైపాస్ రహదారి ఉండగా పార్వతీపురంలో మాత్రం అందుకు భిన్నంగా నిర్మించారు. పట్టణం మధ్య నుంచి బైపాస్ రహదారి ఉండడంతో పాదచారులు, వాహన చోదకులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు.



జిల్లా కేంద్రం మీదుగా వెళ్తున్న భారీ వాహనాలు

● రోజూ ఉదయం 8 గంటల తరువాత పార్వతీపురం రద్దీగా మారుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది విద్యార్థులు బస్సులు, ప్రైవేట్ వాహనాలపై పాఠశాలలు, (మిగతా 8వ పేజీలో...)



పట్టణంలో భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో వాహనదారుల పరిస్థితి ఇదీ..

విద్యుత్ బిల్లుకూ ఉందో లెక్క



● అపోహలు తొలగించేందుకు ట్రాన్స్‌కో ప్రచారం

రాజాం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి)

మా ఇంట్లో రెండంటే రెండే ట్యూబ్‌లైట్లు, ఒకటే ఫ్యాన్ ఉన్నాయి. అయినా ప్రతినెలా వందల్లో విద్యుత్ బిల్లు వస్తోందంటూ ఒకరు! మేం ఇంట్లో రోజంతా ఉండనే ఉండం.. అయినాసరే నెలనెలా ఎక్కువ మొత్తంలో బిల్లు వస్తోందంటూ మరొకరు! ఇలాంటి వార్తలు తరచూ వింటునే ఉంటాం. మీటర్లలో నమోదైన రీడింగ్ ప్రకారం అక్కడికక్కడే సిబ్బంది తీసిన బిల్లు వెనుక ఓ లెక్క ఉందన్న విషయం చాలామందికి తెలియదంటే అతిశయోక్తి కాదు. నెలనెలా ట్రాన్స్‌కో అందజేస్తున్న బిల్లు లెక్కింపు ఎలా చేస్తారో ప్రతి వినియోగదారుడూ ఇట్టే తెలుసుకోవచ్చును. ట్రాన్స్‌కో విజయనగరం రూరల్ డివిజన్ ఈఈ జి.సురేష్‌బాబు అందించిన సమాచారం ప్రకారం.

ఇలా లెక్కించాలి..

రామలక్ష్మి అక్టోబరులో 123 యూనిట్లు విద్యుత్ వినియోగించారు అనుకుంటే.. మొదటి 30 యూనిట్లుకు రూ.1.90 వంతున రూ.57 అవుతుంది. తరువాత 45 యూనిట్లకు రూ.3 వంతున రూ.135 అవుతుంది. మిగిలిన 48 యూనిట్లకు రూ.4.50 వంతున రూ.216 అవుతుంది. మొత్తం ఎనర్జీ ఛార్జీలు రూ.408. ఈ బిల్లుకు అదనంగా ఫిక్స్‌డు ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, ట్రూ అప్, పీపీసీఏ ఛార్జీలు కలిపి ఫైనల్ బిల్లు వినియోగదారుడికి అందిస్తారు. ట్రాన్స్‌కో నిర్దేశించిన తేదీలోగా బిల్లు చెల్లిస్తే సరే. లేకపోతే మరింత భారం వినియోగదారుడిపై పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ సురేష్‌బాబు స్పష్టం చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించి అధిక భారం నుంచి బయటపడాలని ఆయన వినియోగదారులను కోరారు.

● ఇదీ గృహ విద్యుత్ టారిఫ్..

- 0-30 యూనిట్లు.. యూనిట్ ధర రూ.1.90
- 31-75 యూనిట్లు.. రూ.3
- 76-125 యూనిట్లు.. రూ.4.50
- 126-225 యూనిట్లు.. రూ.6
- 226- 400 యూనిట్లు.. రూ.8.75
- 400 యూనిట్లు పైన.. రూ.9.75

● కమర్షియల్ టారిఫ్ ఇలా..

- 0-50 యూనిట్లు.. రూ.5.40
- 51-100 యూనిట్లు.. రూ.7.65
- 101-300 యూనిట్లు.. రూ.9.05
- 301-500 యూనిట్లు.. 9.60
- 500 యూనిట్లు పైన... రూ.10.15



కృత్రిమ అవయవాలను పరిశీలన చేస్తున్న ఎంపీ శ్రీభరత్, ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ ప్రతినిధి సిలాయిజాకి

గురుదేవ ట్రస్టును ఆదర్శంగా తీసుకోండి

● విశాఖ ఎంపీ శ్రీభరత్

కొత్తవలస, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గురుదేవ చారిటబుల్ ట్రస్టును ఆదర్శంగా తీసుకుని మరికొందరు సేవా కార్యక్రమాలను చేపట్టాలని విశాఖపట్టణం ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం సాయంత్రం చెన్నైలోనున్న ఆస్ట్రేలియా కాన్సులేట్ సహకారంతో సుమారు రూ.7.50లక్షల విలువైన కృత్రిమ అవయవాలను ఆయన చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఎంపీ మాట్లాడుతూ గురుదేవ చారిటబుల్ ట్రస్టు దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీతో పాటు క్యాన్సర్ రోగులకు చికిత్సలను అందించేందుకు క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం విశేషమన్నారు. ఆస్ట్రేలియన్ కాన్సులేట్ జనరల్ ప్రతినిధి సిలాయిజాకి మాట్లాడుతూ ట్రస్టు సేవలను గుర్తించి కృత్రిమ అవయవాలను అందించామని తెలిపారు. ఈ ట్రస్టు ద్వారా నిస్వార్థంగా మరిన్ని సేవా కార్యక్రమాలను అందించాలని ఆమె కోరారు. ట్రస్టు ఛైర్మన్ జగదీష్ బాబు, వైస్‌ఛైర్మన్ ఫణీంద్ర, ప్రతినిధులు పారిశ్రామికవేత్త వల్లూరి జయప్రకాష్‌బాబు, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ, నాయకుడు రాము పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తోలంగూడలో గుర్తింపు కార్యక్రమం పర్యవేక్షిస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్

కురుపాం రూరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): గిరిశిఖర గ్రామాల్లో శుక్రవారం కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపును వైద్య సిబ్బంది ప్రారంభించారు. కుష్టు వ్యాధిగ్రస్థుల అవస్థలపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'గుర్తిస్తారా.. ఆదుకుంటారా?' శీర్షికతో ప్రచురితమైన కథనానికి మన్యం జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ మంతిని వినోద్‌కుమార్ స్పందించారు. మొండెంఖల్, నీలకంఠాపురం పీహెచ్‌సీల పరిధిలో కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. నీలకంఠపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.వల్లితో కలిసి తోలంగూడలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. వ్యాధి లక్షణాలు, వైద్య ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డా.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 30 వరకూ కుష్టు వ్యాధిగ్రస్థుల సర్వే జరుగుతుందన్నారు. ఇప్పటికే 114 మంది అనుమానితులను గుర్తించామన్నారు. వీరందరి చర్మ నమూనాలను పరీక్షలకు పంపంచాం. రిపోర్టులు వచ్చిన తరువాత ట్రీట్‌మెంట్ ప్రారంభిస్తామని తెలిపారు.

'గురజాడ' సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయండి

● రేపు విజయనగరంలో గౌరవ యాత్ర

విజయనగరం కల్చరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురజాడ గృహాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఆయన పేరుతో విజయనగరంలో సాంస్కృతిక విశ్వవిద్యాలయం నెలకొల్పాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ఎంవీఎన్ వెంకటరావు, సాహితీ సమితి రాష్ట్ర కన్వీనర్ చీకటి దివాకర్ కోరారు. ఈ నెల 30న గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గురజాడ గృహాన్ని పరిరక్షించాలని కోరారు. గురజాడ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. గురజాడ దేశభక్తి గేయాన్ని విద్యాలయాల్లో ప్రార్థన గీతంగా ప్రకటించాలని కోరారు. ఈ నెల 30న గురజాడ స్త్రీ పాత్ర ఔన్నత్యం, కన్యాశుల్కం-సామాజిక ప్రయోజనం తదితర అంశాలపై ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సాహితీగోష్టి ఉంటుందన్నారు. అంతకు ముందు గురజాడ గృహం నుంచి జిల్లా ప్రజా పరిషత్ ప్రాంగణం వరకూ సాహితీ వేత్తలు, పుర ప్రముఖులు, విద్యార్థులు, సామాజిక, ప్రజా సంఘాలతో గురజాడ గౌరవ యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సమతా విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, నాయకులు రాజగోపాల్, ట్రెజరీ ఉద్యోగుల సంఘ నాయకులు పి.సురేష్‌కుమార్, జన విజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి సీహెచ్ సింహాచలం పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి



బొండపల్లి: సైకిల్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న పోలీసు సిబ్బంది

బొండపల్లి (గజపతినగరం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు అనే మహమ్మారికి విద్యార్థులు, ప్రజలు దూరంగా ఉండాలని బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు కోరారు. 'అభ్యుదయం' సైకిల్ యాత్ర శుక్రవారం గజపతినగరం చేరుకుంది. సీఐ నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు డప్పు వాయిద్యాలు, కోలాటాలతో వారికి స్వాగతం పలికారు. గజపతినగరంలోని హనుమాన్ జంక్షన్ నుంచి మరుపల్లిలోని బాలాజీ పాలిటెక్నిక్ కళాశాల వరకు ఈ సైకిల్ ర్యాలీ కొనసాగింది. అనంతరం పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో సీఐ నారాయణరావు ప్రసంగించారు. యువత డ్రగ్స్‌కి బానిసలు కావడం వల్ల బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. మాదక ద్రవ్యాలు, గంజాయి వాడకంతో ఆర్థికంగా, సామాజికంగా చితికిపోతున్నారన్నారు. అందుకే విద్యార్థులు, ప్రజలు ఈ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు అలాగే సోషల్ మీడియాకు, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి విద్యనభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం, బొండపల్లి, మానాపురం, బూర్జవలస, రామభద్రపురం, బాడంగి, తెర్లాం ఎస్‌ఐలు కిరణ్‌కుమార్ నాయుడు, యు.మహేష్, ఆర్.జయంతి, జి.రాజేష్, వి.ప్రసాదరావు, తారకేశ్వరరావు, సాగర్‌బాబు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దత్తిరాజేరులో..

దత్తిరాజేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్‌ఐలు జి.రాజేష్, ఆర్.జయంతి అన్నారు. స్థానిక జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో స్టేషన్ బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్, పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతిలు డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు నిర్వహిస్తున్న అభ్యుదయ సైకిల్ ర్యాలీకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయి శరీరంలోని ప్రతి అవయవంపై తీవ్ర ప్రభావం చూపుతుందని గుర్తు చేశారు. విద్యార్థులు వాటికి దూరంగా ఉండి భవిష్యత్తుపై దృష్టి పెట్టాలన్నారు. చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. స్థానికులు వాయిద్యాలతో ఈ సైకిల్ ర్యాలీకి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పోలీసు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



దత్తిరాజేరు: ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

క్యూబీ టెక్ స్మార్ట్ సొల్యూషన్స్‌తో జేఎన్‌టీయూ ఒప్పందం

విజయనగరం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ టెక్నాలజీ సంస్థ క్యూబీ టెక్ స్మార్ట్ సొల్యూషన్స్- జేఎన్‌టీయూల మధ్య క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో విద్య, పరిశోధన, నైపుణాభివృద్ధిపై కీలకమైన ఒప్పందం కుదిరింది. శుక్రవారం ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు అంతర్జాతీయ ప్రమాణాలను అధ్యయనం చేసే అవకాశానికి ఈ ఒప్పందం నాంది పలికిందన్నారు. ఫార్మసీ, హెల్త్‌కేర్, డ్రగ్ డిస్కవరీ, కృత్రిమ మేధస్సు కు అవసరమైన, అపారమైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అమరావతిలో ఏర్పాటు చేసిన క్వాంటమ్ వ్యాలీలో ఉద్యోగ అవకాశాలు మెండుగా వస్తాయన్నారు. కార్యక్రమంలో క్యూబీ టెక్ సొల్యూషన్స్ వ్యవస్థాపకుడు పృథ్వీపిన్నాక, ప్రొఫెసర్ జయసుమ, చంద్రభూషణరావు, స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చింతలబెలగాంలో విచారణ చేస్తున్న తహసీల్దార్ అప్పారావు

జియ్యమ్మవలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చింతలబెలగాం గ్రామ దళితులు, అగ్రకులాల మధ్య గత కొన్నేళ్లుగా నలుగుతున్న భూవివాదం ఆ గ్రామాన్ని అగ్గి రాజేస్తోంది. దీనిపై ఈ నెల 20న 'ఆంధ్రజ్యోతి'లో 'పేదల భూములపై పెద్దల పాగా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని తహసీల్దార్ ఎస్.అప్పారావును ఆదేశించింది. దీంతో ఇరువర్గాలకు తహసీల్దార్ నోటీసులు అందజేసి, శుక్రవారం చింతలబెలగాం సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. అయితే తుమ్మలవలస రెవెన్యూ పరిధిలో 12 సర్వే నెంబర్లలో 6.66 ఎకరాలు, చింతల బెలగాం రెవెన్యూ పరిధిలో 9 సర్వే నెంబర్లలో 5.40 ఎకరాలు కలిపి మొత్తం 12.06 ఎకరాల భూమితో పాటు చెరువు ఆక్రమణ, శ్మశానవాటిక స్థలం ఆక్రమణలపై విచారణ నిర్వహించారు. అయితే ముందుగా పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన పిర్యాదు, 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాన్ని పరిశీలించారు. తర్వాత రికార్డులను పరిశీలించారు. చింతలబెలగాం రెవెన్యూ పరిధిలో 1-7 సర్వే నెంబర్ల వివరాలు, తుమ్మలవలస రెవెన్యూ పరిధిలో 1-9 సర్వే నెంబర్లకు సంబంధించిన వివరాలకు ఎస్ఎఫ్ఏ లేనట్టు గుర్తించారు. తర్వాత ఈ 14 మంది దళితుల భూములకు సంబంధించి వారి వాంగ్మూలం, వారి వద్ద ఆధారాలతో పాటు భూములు ఆక్రమణలు చేసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అగ్రకులాల వద్ద ఉన్న ఆధారాలు, వారి వాంగ్మూలాలను తీసుకున్నారు. గ్రామసభ ప్రశాంతంగా జరిగేలా చినమేరంగి ఎస్ఐ పి.అనీష్, ఏఎస్ఐ పత్రిక కాసులు చర్యలు చేపట్టారు. దీనిపై రెవెన్యూ రికార్డులను పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ అప్పారావు తెలిపారు. తర్వాత గృహ నిర్మాణ స్థలాలను పరిశీలించారు. సర్వే నెంబరు 46/1లో ఉన్న 2.60 ఎకరాల చెరువు భూమిపై ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని దళితులకు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని దళితులు కోరారు. కేవలం ఇప్పుడు 60 సెంట్లు స్థలం మాత్రమే చెరువు ఉందన్న విషయాన్ని తహసీల్దార్ గుర్తించారు. రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్ చేసి రికార్డులనే తారుమారు చేసిన గత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని దళితులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీటీ కె.శివయ్య, ఆర్ఐ సీతారామరాజు, మండల సర్వేయర్ రమణమూర్తి, వీఆర్వో వినాయకుడు, గ్రామ సర్వేయరు అప్పలస్వామి, పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

● ఎస్పీ మాధవరెడ్డి



వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ

బెలగాం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్‌ను ఎస్పీ నిర్వహించారు. పోలీసుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామ న్నారు. ఉద్యోగుల సమస్యలు అవకాశం ఉన్నంతవరకు పరిష్కరించామన్నారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

శబ్దం వస్తే వాహనం స్వాధీనం

● సైలెన్సర్లు మారిస్తే కఠినచర్యలు



ఎక్స్‌కవేటర్‌తో సైలెన్సర్లను తొక్కిస్తున్న దృశ్యం

రాజాం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లతో తిరుగాడితే వాహనాలను సీజ్ చేస్తామని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. కంపెనీ నుంచి వాహనంతో వచ్చిన సైలెన్సర్లను మాత్రమే కొనసాగించాలని ఆయన స్పష్టం చేశారు. కొంతమంది బుల్లెట్ వాహనాలకు పెద్దశబ్దం వచ్చే సైలెన్సర్లను అమరుస్తూ ప్రజలను భీతిల్లేలా చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. అలాంటి 18 సైలెన్సర్లను స్వాధీనం చేసుకుని పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో శుక్రవారం రాత్రి ఎక్స్‌కవేటర్లతో తొక్కించి ధ్వంసం చేయించారు. భవిష్యత్తులో పెద్దసైలెన్సర్లతో తిరుగాడితే వాహనాలను సీజ్‌చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విజయనగరంలో పశువుల సంచారంపై నిషేధం

● కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో పశుసంచారాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ప్రకటించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో పశువుల పెంపకందారులతో సమావేశమయ్యారు. డిసెంబరు 16 నుంచి నగరంలోని వీధులు, రోడ్లపై పశువులు సంచరిస్తే వాటిని గోశాలకు తరలించాలన్నారు. పోలీసులు, కార్పొరేషన్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి పశువులను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. పశువుల పెంపకందారులు డిసెంబరు 16లోగా పశువులను వేరే ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రజారోగ్యశాఖాధికారి సాంబమూర్తి, ట్రాఫిక్ ఎస్ఐ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య, తదితరులు

లింగ నిర్ధారణ పెద్ద నేరం: కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ నేరమని, గర్భ నిర్ధారణ స్కానింగ్ సెంటర్లపై థర్డ్ పార్టీ నిఘాను ఏర్పాటు చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీసీపీఎన్‌డీటీ చట్టం అమలుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లింగ నిర్ధారణ వివరాలు బయటకు వెళ్లకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే దానిపై ఆరా తీశారు. స్కానింగ్ కేంద్రాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు థర్డ్‌పార్టీ మానిటరింగ్‌ను ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. సేఫ్ డెలివరీ క్యాలెండర్ ప్రకారం ప్రసవాలు జరిగేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అవసరం లేని సందర్భాల్లో కేసులను రిఫర్ చేస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. కొత్త స్కానింగ్ సెంటర్ల స్థాపనకు వచ్చిన ఐదు దరఖాస్తులు, రెన్యువల్ కోసం వచ్చిన ఒకటి, స్కానింగ్ మిషన్ల తొలగింపునకు మూడు, స్కాన్ సెంటర్ల తొలగింపునకు వచ్చిన రెండు దరఖాస్తులను ఆమోదించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి జీవనరాణి, అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారి రాణి తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా... లింగ సమానత్వమే లక్ష్యంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 4.0 కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించారు. దీని కోసం రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.


పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ రామసుందర్ రెడ్డి

రోడ్డు ప్రమాదాలను నివారించండి

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. బ్లాక్ స్పాట్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలను గుర్తించి... నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో 25 బ్లాక్ స్పాట్స్ ఉన్నాయని, వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు ప్రమాద కేసులను త్వరగా పరిష్కరించి.. బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నమోదు చేసే ఐరాడ్ యాప్‌పై చర్చించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మజ్జి అప్పారావు, సౌమ్యలత, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ కాంతిమతి, డీటీసీ మణికుమార్, పీఆర్ ఎస్‌ఈ శ్రీనివాసరావు, ఐరాడ్ మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో పీటీఎంలు

వచ్చే నెలలో జరగనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలను (మెగాపేరెంట్స్, టీచర్ మీటింగ్) పండగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రామసుందర్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం పీటీఎంల నిర్వహణపై విద్యాశాఖాధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈసారి కేవలం జూనియర్ కళాశాల్లో మాత్రమే నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో డీఈవో మాణిక్యం నాయుడు, ఏపీసీ రామారావు, బీసీ వెల్ఫేర్ అధికారి జ్యోతిశ్రీ, డీడీ అన్నపూర్ణ పాల్గొన్నారు.

వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. పొగిరిలో శుక్రవారం నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సమూల మార్పుల దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. దానిలో భాగంగా పంచసూత్రాల ద్వారా రైతులకు మేలుచేసే కార్యక్రమాలపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, కూటమి నేతలతో కలిసి రైతన్నా మీకోసం కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ మాట్లాడుతూ రైతులు లాభసాటిగా ఉండే పంటలను వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సుమల వెంకటమన్మథరావు, గురవాన నారాయణరావు, కొల్ల అప్పల నాయుడు, దుప్పలపూడి శ్రీనివాసరావు, శాసపు రమేష్ కుమార్, సుమల జగన్మోహన్ రావు, ఎంపీడీవో జె.ఆనందరావు, ఏడీ కె.చంద్రరావు, ఏవో చీకటి రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు,

కార్యకర్తల సంక్షేమానికి కృషి

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ లక్ష్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్, కార్యకర్తే అధినేత అనే కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ గడ్డుకాలంలో ఉన్నపుడు అండగా ఉన్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. అనంతరం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో 30వరకు వినతులు వచ్చాయన్నారు. తక్షణమే పరిష్కరించడానికి సంబంధిత అధికారులకు పంపించినట్టు తెలిపారు. అనంతరం ప్రశాంత్ నగర్‌లో రూ.21 లక్షలతో కాలువ, సిమ్మెంట్ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కొల్ల అప్పలనాయుడు, బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి కృషి


వినతులు స్వీకరిస్తున్న కర్రోతు బంగార్రాజు

భోగాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామం లో ఆయన స్వగృహం వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, కార్యకర్తల నుంచి భూ సమస్యలు, రోడ్లు, కాలువలు, విద్యుత్తు తదితర సమస్యలపై వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యకర్తలతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, అర్జీదారులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు


సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ శారదాదేవి

సంతకవిటి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే శాఖా పరమైన చర్యలు కఠినంగా ఉంటాయని మండల ప్రత్యేక అధికారి, డుమా పీడీ శారదాదేవి సిబ్బందికి హెచ్చరించారు. శుక్రవారం మండల అభివృద్ధి అధికారి కె.సురేష్‌కుమార్‌తో కలసి సిరిపురం, మిర్తివలస, మండవకురిటి, సురవరం సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయాలకి వచ్చిన ఫిర్యాదులను సిబ్బంది సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఆమెతో పాటు ఏపీవో హరినాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలు పరిశుభ్రంగా ఉండాలి


సచివాలయంలోని రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని సచివాలయాలు పరిశుభ్రంగా ఉండకపోతే సిబ్బందిపై వేటు తప్పదని కమిషనర్ నల్లనయ్య హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని 33వ సచి వాలయాన్ని ఆయన ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భం గా సచివాలయ వాతావరణం అపరిశుభ్రంగా ఉండటంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే ప్రజలకు ఎలా అవగాహన కల్పిస్తామని ప్రశ్నించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సచివాలయంలోనే ఉండాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి


కొత్తవలస టీడీపీ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు


రాజాం రూరల్: బీఎస్పీ కార్యాలయంలో...

కొత్తవలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కోళ్ల వెంకటరమణ, నాయకులు బొబ్బిలి అప్పారావు, కనకాల శివ, కొరుపోలు అప్పారావు, వీఎఎస్‌వి రమేష్, లెంక శ్రీను పాల్గొన్నారు. కొత్తవలస జంక్షన్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆపార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు బోనికృష్ణ నేతృత్వంల జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఎస్.కోటలో...

శృంగవరపుకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎసీఎస్ కార్యాలయంలో జ్యోతిబాపూలే వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పీఎసీఎస్ ఛైర్మన్ జీ.ఎస్.నాయుడు, రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్‌లు నానిగిరి రమణాజీ, బంగారు నాయుడులు పూలమాలలు వేశారు.

రాజాంలో...

రాజాం రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి):జ్యోతిరావుపూలే సేవలు ఆదర్శమని దళిత నాయకులు అన్నారు. స్థానిక బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జరజాన నీలయ్య, దేబారిక రామప్పడు, బొత్స బుద్ధుడు, తవిటయ్య, పాపారావు, తేగల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్.కోటలో...

లక్కవరపుకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్దగల మహాత్మజ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యామీకే పాత్రో, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రులే పిల్లలకు మొదటి గురువులు


ఎస్.కోటలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్‌వీ రమణ

శృంగవరపుకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులే పిల్లలకు మొదగి గురువులని ఆంధ్ర మెడికల్ కళాశాల మానసిక వైద్యుడు డాక్టర్ ఎస్.వి.రమణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాలబాలికలపై లైంగిక వేధింపుల నిరోధంపై ప్రభుత్వ ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమాజంలో ఏడు శాతం పిల్లలు లైంగిక వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. బాల్య వివాహాలను నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్‌లు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

పోక్సోపై అవగాహన సదస్సు

లక్కవరపుకోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు, పోక్సో చట్టంపై శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు బి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే క్లినికల్ సైకాలజిస్టు ఉదయ్‌కుమార్, శ్రీనివాసరావులు లైంగిక వేధింపులు, పోక్సో చట్టంపై మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కూర్మారావు, ఐసీడీఎస్, హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

చీపురుపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన రూ.5,97,413 విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దన్నాన రామచంద్రుడు, పైల బలరాం, గవిడి నాగరాజు, ముల్లు రమణ, రెడ్డి గోవిందరావు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చదును పనులు నిలిపివేత

నెల్లిమర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సర్వేనెంబరు 75లో గల వివాదాస్పద స్థలాన్ని చదును చేసే పనులను రెవెన్యూ అధికారులు శుక్రవారం నిలిపివేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణాన్ని ఆనుకొని ఉన్న సర్వే నెంబరు 75లోని సుమారు రెండున్నర ఎకరాల స్థలాన్ని శుక్రవారం విజయనగరానికి చెందిన మాన్సాస్ సంస్థ అధికారులు జేసీబీతో చదును చేయడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీకాంత్ ఆ పనులను నిలిపివేసి, వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లు తీసుకురావాలని సూచించారు. డాక్యుమెంట్లను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

లైంగిక దాడులకు పాల్పడితే చర్యలు

చీపురుపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):చిన్న పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా మానసిక ఆరోగ్య నోడల్ అధికారి డా. ఎన్.దీప్‌చంద్ అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలపై లైంగిక దాడుకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం ప్రకారం చర్యలుంటాయన్నారు. కర్లాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌కు ఆమోదం

భోగాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భోగాపురం మండల ప్రజా పరిషత్ 2026-2027 అంచనా బడ్జెట్ రూ.96 కోట్ల30 లక్షల 52వేల 540గా ఏవో కామేశ్వరరావు తెలిపారు. ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో డీడీ స్వరుపరాణి, వైస్ ఎంపీపీలు దంతులూరి సూర్యనారాయణరాజు, పచ్చిపాల నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● మెరకముడిదాం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అంచనా బడ్జెట్‌ను సభ్యులంతా శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 2025-26కు అంచనా బడ్జెట్‌ను మండల అభివృద్ధి అధికారి గొర్లె భాస్కరరావు ప్రవేశపెట్టగా... పరిపాలనా అధికారి సుధాకర్ పట్నాయక్ గణాంకాలతో సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు తలచుట్ల హరిబాబు, కందుల పార్వతి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

సంతకవిటి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తం కావాలని ఎస్ఐ ఆర్.గోపాలరావు అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపైన శుక్రవారం అక్కరాపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్‌లు వస్తే 1930కి కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గరివిడి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని ఎస్ఐ బి.లోకేశ్వరరావు అన్నారు. గరివిడి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం మండలంలోని ఆటో డ్రైవర్లతో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

చర్యలు తీసుకోండి

ఎస్.కోట రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిందాల్ కోసం ద్రోహం చేసిన రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని నిర్వాసితులు కోరారు. బొడ్డవర గ్రామంలో 168 రోజులుగా నిరసన చేస్తున్న వీరు శుక్రవారం మాట్లాడుతూ కిల్తంపాలెం పంచాయతీ దెప్పూరులో జిందాల్ భూసేకరణ సమయంలో ఇళ్లు, భూములు కలిసిపోయాయని చెప్పారని తెలిపారు. అలాగైతే గత ప్రభుత్వం జగనన్న కాలనీలు, పట్టాలు వంటివి ఎలా ఇచ్చిందని ప్రశ్నించారు. దీనిపై దర్యాప్తు చేసి... తిరిగి పట్టాలు ఇవ్వాలని కోరారు.

సౌకర్యాలపై దృష్టి

నెల్లిమర్ల, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ వసతి గృహాల సమస్యలపై 'ఆంధ్రజ్యోతి'లో 'పర్యవేక్షణేదీ?' అనే శీర్షికన గురువారం ప్రచురితమైన కథనంపై జిల్లా బీసీ సంక్షేమాధికారి జయశ్రీ స్పందించారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 47 సంక్షేమ వసతి గృహాలను 21 మంది సంక్షేమ అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

క్రైం న్యూస్

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు వడిమజ్జి రవికి స్థానిక పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, 3 వేల జరిమానా విధించారు. బాధితురాలికి పరిహారంగా రూ.50 వేలు మంజూరు చేస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు. నగరానికి చెందిన వడిమజ్జి రవి ఈ ఏడాది జనవరి 21న ఓ బాలికను ఇంట్లోకి పిలిచి లైంగిక దాడికి పాల్పడినట్టు తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ బి.రేవతి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం అప్పటి మహిళా పోలీసు స్టేషన్ ఎస్ఐ బి.భాగ్యం న్యాయస్థానంలో అభియోగ పత్రాలు సమర్పించారు. నేరారోపణలు రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా వ్యవహరించిన మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ నర్సింహమూర్తి, హెచ్‌సీ రామకృష్ణ, కోర్టు కానిస్టేబుల్ సూరప్పనాయుడు, పీపీ ఖజానారావులను ఎస్పీ దామోదర్ అభినందించారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొండపల్లి (గజపతినగరం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ జె.జనార్దనరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో గజపతినగరం మండలం సాలిపేట గ్రామంలో ఆరు మద్యం సీసాలు కలిగి ఉన్న జి.రవికుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా, కలిగి ఉన్నా కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణకు వేలం పాటలు నిర్వహించడం నిషిద్ధమన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ పి.నరేంద్రకుమార్, హెచ్‌సీలు ఎండీజేబాషా, పీబీఎస్‌వీఆర్.రాజు, కానిస్టేబుల్ ఎ.అప్పారావులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారుల నిలదీత


అధికారులతో వాదిస్తున్న సభ్యులు

జామి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ సమస్యలపై మండల పరిషత్ సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు. శుక్రవారం జామి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల కేంద్రంలో ప్రజలకు శ్మశానం లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రైతన్నా మీకోసం కమిటీలను సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా వేసిన ఏవో పూర్ణిమపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు దండగ అని పెదవి విరిచారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ యాప్‌తో ప్రయోజనం


బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న రామారావు

పూసపాటిరేగ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన ఏపీఏఐఎంఎస్ యాప్‌ను ప్రతి రైతు వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామారావు సూచించారు. శుక్రవారం కొత్తకొప్పెర్ల గ్రామంలో 'రైతన్నా- మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్ ఉపయోగాన్ని రైతులకు వివరించారు. అన్నదాతా సుఖీభవ పథకం నగదు చాలామంది రైతులకు జమకావటం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి నీలిమ, సర్పంచ్ సంకాబత్తుల సత్తిబాబు, గ్రామపెద్దలు ఆకిరి జగదీశ్వరరావు, పైడి రవి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయు) రాష్ట్ర మహాసభలు డిసెంబరు 8, 9 తేదీల్లో గుంటూరులో జరగ నున్నాయని, వీటిని అన్ని వర్గాలు విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు గణేష్‌పండా పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని కార్యాలయంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అప్పలరాజు రెడ్డి, రెడ్డి నారాయణరావు, సీహెచ్ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్యలకు ముగిసిన శిక్షణ


మాట్లాడుతున్న చిరంజీవి

నెల్లిమర్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల వెలుగు కార్యాలయంలో వార్షిక ప్రణాళిక తయారీ, విజన్ బిల్డింగ్ తదితర అంశాలపై మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో వెలుగు-డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ ఎ.చిరంజీవి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు బలంగా ఉండాలంటే సంస్థాగత నిర్మాణం బాగుండాలని అన్నారు. రాబోయే 5 సంవత్సరాలలో మహిళా సంఘాలు మరింత అభివృద్ధి చెందడానికి, ఆర్థికంగా, సామాజికంగా బలపడడానికి కార్యచరణ ప్రణాళికను సభ్యులతోనే తయారు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు విశ్వేశ్వరరావు, సురేష్, పద్మ, అరుణకుమారి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌జీవో అధ్యక్షుడిగా ప్రసాదరావు

కొత్తవలస, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస తాలూకా యూనిట్‌కు సంబంధించిన గజిటెడ్, నాన్‌గజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికలు జిల్లా సంఘానికి చెందిన కె.ఆదిలక్ష్మి, ఎర్ర రమణల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక ఎన్జీఓ హోంలో జరిగాయి. నూతన అధ్యక్షుడిగా వైద్య శాఖలో పనిచేస్తున్న జీవీ ప్రసాదరావును, అసోసియేట్ అధ్యక్షురాలి కొత్తవలస సబ్ రిజిస్ట్రార్ ఎ.చిన్నమ్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె.కళావతి, కె.వెంకటరావు, ఎల్.రాధాకృష్ణ, పి.భాగ్యలక్ష్మి(మహిళా శిశు సంక్షేమశాఖ)లను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం.కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.కనకరాజు, ప్రభుదాసు, పి.శ్రీను, ఎస్.రాములచ్చుము, బి.అశ్విని, డి.అప్పారావు, కోశాధికారిగా డి.ఎన్.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమం అనంతరం కొత్తవలస ఎన్జీఓ హోం నుంచి జంక్షన్ వరకు ర్యాలీచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు శ్రీధర్, సురేష్, జీవీ ఆర్ఎస్ కిషోర్, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మత్తు' వీడాలని..

(ఐదో పేజీ తరువాయి)

తనిఖీలు చేస్తున్నారు. చాలా మంది పట్టుబడుతు న్నారు. వారిని జైల్లో పెట్టి త్వరితగతిన శిక్షలు పడేటట్లు ప్రయత్నిస్తున్నారు. గంజాయి అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులను జప్తు కూడా చేస్తున్నారు. అయినప్పటికీ గంజాయి రవాణా ఆగడం లేదు. దొరికినప్పుడల్లా వంద నుంచి ఐదొందల కేజీల వరకు పట్టుబడు తోంది. ఒక్కోసారి వెయ్యికేజీలు ఉంటోంది. ఇంత పెద్దమొత్తంలో గంజాయి ఇతర రాష్ట్రాలకు తరలించడంలో స్థానిక యువత సహకారం ఉన్నట్లు పోలీస్ శాఖకు గుర్తించింది. గంజాయి రవాణా సమయంలో దొరికిన వారిలో స్థానికులే ఎక్కువగా ఉంటున్నారు. వ్యాపారులు పట్టుబడినా అక్రమంగా సంపాదించిన సొమ్ముతో బెయిల్‌పై బయటకు వచ్చేస్తున్నారు. వీరు మాత్రంలో జైల్లోనే ఉంటున్నారు. పరిస్థితి మారాలని బలంగా నిర్ణయించుకున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి వినూత్నంగా అవగాహన కల్పించేందుకు ప్రణాళిక రూపొందించారు. అనకాపల్లి జిల్లా పాయకరావు పేట నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు అభ్యుదయం పేరుతో సైకిల్ యాత్ర చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో వారం రోజులుగా ర్యాలీ నడుస్తోంది. ఎస్పీ ఏఆర్ దామోదర్ సైకిల్ యాత్ర ఆగే ప్రతి స్టేషన్ వద్ద గంజాయి రవాణా, వాడకంతో జరిగే నష్టాలు, కేసులు, ఆస్తుల జప్తుతో పాటు సమాచారం ఇచ్చేందుకు వున్న టోల్ ఫ్రీ నెంబర్ 1972ను ప్రదర్శిస్తున్నారు. ఆటలు, పాటల రూపంలోనూ అవగాహన కల్పిస్తున్నారు.

గంజాయి వైపు యువత..

ఒడిశా రాష్ట్రం అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాకు సరిహద్దుగా ఉంది. ఈ సరిహద్దు ప్రాంత కొండల్లో గంజాయిని పండేంచేలా వ్యాపారులు పెట్టుబడులు పెడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గంజాయి రవాణాను అడ్డుకోవడమే మానేశారు. దీంతో విచ్చవిలవిడి తనం పెరిగింది. ఈ వ్యాపారం ద్వారా సుల భంగా డబ్బులు రావడంతో స్థానిక యువత చూపు అటు మళ్లింది. గంజాయి వాడకానికి కూడా అలవాటు పడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నప్పటికీ ప్ర యోజనం ఉండడం లేదు. అలవాటు పడిన వారు కేసులు నమోదవు తున్నా జంకడం లేదు. రూట్లు మార్చి రవాణాకు సిద్ధపడుతున్నారు.

రవాణా ఇలా..

అరకు, అనంతగిరి నుంచి శృంగవరపుకోట, కొత్తవలస మీదుగా గంజాయిని విశాఖకు తరలిస్తున్నారు. మధ్యలో బొడ్డవర చెక్ పోస్టు వద్ద తనిఖీలు జరుగుతున్నాయని తెలిస్తే చిలకల గెడ్డ పైనుంచి ఉన్న అడ్డదారిలోకి వెళ్తున్నారు. ఆపై తాటిపూడి రోడ్డుపైకి వచ్చి విజయనగరం మీదుగా విశాఖకు తరలిస్తున్నారు. లేదంటే ఆంధ్ర, మెంటాడ, గజపతినగరం మీదుగా విజయనగరం, సాలూరు, పార్వతీ పురం, పాడేరు, నర్సీపట్నం మీదుగా కూడా రవాణా జరుగుతోంది. ఇలా అనేక రూట్లలో పోలీస్ నిఘా బట్టి వారిని తప్పించుకొని తరలిం చుకుపోతున్నారు. గంజాయి రవాణాలో స్థానికుల మధ్య విభేదాలు వచ్చినప్పుడు మాత్రం ఒకరిపై ఒకరు పోలీస్‌లకు సమాచారం ఇచ్చి గంజాయి పట్టుబడేటట్లు చేస్తున్నారు. ఈ సమయంలో గంజాయి రవాణాకు సహకరిస్తున్న స్థానిక యువత పట్టుబడుతోంది. కేసుల్లో ఇరుక్కుంటున్నారు. జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

● గంజాయి మత్తుపదార్థం. దీన్ని అక్రమంగా ఉత్పత్తి చేసినా, రవాణా చేసినా, కొనుగోలు, అమ్మకం చేసినా చట్టప్రకారం నేరం. ఈ విషయం కొంత మందికి తెలియక గంజాయి వ్యాపారుల ఉచ్చులో పడుతున్నారు. ఇలా పడకుండా ఉండేందుకు పోలీస్ శాఖ చేస్తున్న ఈ ప్రయత్నం కొంత వరకైనా సఫలీకృతమవుతుందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

మన్యంలో పదిరోజుల పాటు యాత్ర

జిల్లాలో సాలూరు, పాచిపెంట, మక్కువ, బలిజిపేట తదితర ప్రాంతాల్లో శనివారం నుంచి పది రోజుల పాటు సైకిల్ యాత్ర కొనసాగుతుంది. మంత్రి సంధ్యారాణి, ప్రజాప్రతినిధులు, అధికా రులు, పోలీసులు, యువత ఇందులో పాల్గొంటారు. మన్యంలో గంజాయి , మాదక ద్రవ్యాల నివారణకు పటిష్ఠచర్యలు చేపడుతన్నాం.

- మాధవరెడ్డి, ఎస్పీ, పార్వతీపురం మన్యం

ట్రాఫిక్ కష్టాలు తీరేనా?

(5వ పేజీ తరువాయి)

కళాశాలలను వస్తుంటారు. అదే సమయంలో పట్టణంలోని ప్రధాన, బైపాస్ రహదారి గుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు భారీ వాహనాలు వెళ్తుంటాయి. దీంతో మిగతా వాహనదారులు, ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుపోవాల్సి వస్తోంది.● జిల్లా కేంద్రలోని ఆర్టీసీ కాంప్లెక్స్, సౌందర్య థియేటర్ రోడ్డు, నాలుగు రోడ్ల పాతబస్టాండ్ కూడళ్ల మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలోనే ట్రాఫిక్ సమస్య జటిల మవుతోంది. పాతబస్టాండ్ నుంచి బైపాస్ రహదారి మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ వాహనాలను మళ్లిస్తున్నా.. ప్రయోజనం ఉండడం లేదు. ఒక్కోసారి సిగ్నల్ పాయింట్ల వద్ద సాంకేతిక సమస్యలు తలెత్తితే ఇక అంతే సంగతి. ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోవాల్సిందే. ఈ సమయంలో ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు పోలీసులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. దీనిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది. పక్కా ప్రణాళికతో ముందుకెళ్తేనే జిల్లా కేంద్రవాసులు ట్రాఫిక్ సమస్య నుంచి గట్టెక్కే అవకాశం ఉంది. భవిష్యత్‌లో పట్టణ వెలుపల నుంచి బైపాస్ రహ దారిని ఏర్పాటు చేయకపోతే పాదచారులు, వాహనచోదకులు మరిన్ని కష్టాలు పడక తప్పదనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ప్రణాళికలను సిద్ధం చేశాం..

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాం. భారీ వాహనాలు వెళ్లే సమయంలోనూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాం. **- మురళీధర్, సీఐ, పార్వతీపురం టౌన్**

శివారు భూములకు సాగునీరందిస్తాం

మక్కువ రూరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): వెంగళరాయసాగర్ ప్రాజెక్టు ఎడమకాలువ పరిధిలోని గోముఖి నదిపై అసంపూర్తిగా నిలిచిపోయిన ఆక్విడక్ట్ పనులను డిసెంబరులో ప్రారంభిస్తామని వెంగళరాయసాగర్ డీఈఈ డి.సురేష్ తెలిపారు శుక్రవారం 'ఆక్విడక్ట్ పూర్తికాక.. సాగునీరు అందక' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వెంగళరాయసార్ ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు రూ.63కోట్ల 50 లక్షల మంజూరు కాగా, అందులో రూ.10.07 కోట్లతో 22శాతం పనులు పూర్తిచేశామన్నారు. ప్రాజెక్టు ఆధునీకరణలో భాగంగా హెడ్ వర్క్సులో మట్టికట్ట, రక్షణ గోడ, జనరేటర్ రూమ్, గట్టుకు మరమ్మతులు, ప్రధాన కాలువ తూముల మరమ్మతు పనులు పూర్తిచేశామన్నారు. ప్రధాన కాలువలో 38.545 కిలోమీటర్ల వరకు లైనింగ్ పనులు చేపట్టాల్సి ఉందని డీఈఈ వివరించారు.

రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం

● ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం లక్కగూడ పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం వ్యవసాయ పెట్టుబడి సాయంగా సంవత్సరానికి రూ.20 వేలు కూటమి ప్రభుత్వం అందజేస్తోందన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబించాలన్నారు. ప్రధానంగా ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించాలన్నారు. అన్నదాతల ముఖాల్లో చిరునవ్వు చూడటమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు కడ్రక కళావతి, బిడ్డిక పద్మావతి, అడ్డాకుల నరేష్, వెంపటాపు భారతి, పత్తిక ముసురు, ఆరిక జానకి, తాడంగి లక్ష్మణరావు, తహసీల్దార్ శేఖరం పాల్గొన్నారు.

కూటమితోనే సమస్యలు పరిష్కారం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆమె వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అడ్డాకుల నరేష్, వెంపటాపు భారతి, పత్తిక ముసురు, తాడంగి లక్ష్మణరావు, లక్ష్మి పాల్గొన్నారు.

సక్రమంగా సేవలు అందించాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ ప్రజలకు మౌలిక వసతులు, పౌరసేవలు సక్రమంగా అందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో అధికారులతో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో తాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ, స్ట్రీట్ లైటింగ్, పారిశుధ్య నిర్వహణపై అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షాకాలంలో ఇబ్బందులు, బలహీనంగా ఉన్న కాలువలు, చెత్త తొలగింపు అంశాలను ప్రస్తావించారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణ చర్యలు ప్రారంభించి నిర్దిష్ట గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. పట్టణ పట్టణ అభివృద్ధిపై రాజీ లేకుండా ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా పని చేయడం లక్ష్యమన్నారు. సమావేశంలో నగర పంచాయతీ కమిషనర్ రత్నం రాజు, ఇంజనీరింగ్, పబ్లిక్ హెల్త్, రెవెన్యూ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జయకృష్ణకు సత్కారం

●పాలకొండ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వచ్చిన శాసనసభ అంచనాల కమిటీ సభ్యుల్లో ఒకరైన పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం సత్కరించారు. శాసనసభ అంచనాల కమిటీ సమావేశానికి వచ్చిన జయకృష్ణను వారు స్వాగతం పలికారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ

పార్వతీపురం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరిం చేందుకు కృషి చేయాలని జేసీ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల గ్రీవెన్స్‌లో 36 అర్జీలను స్వీకరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్య క్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, జిల్లా ఖజానా అధికారి ఆర్.ఎస్.కమార్, కలెక్టరేట్ ఏవో చిన్నారావు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరించిన జేసీ

●పార్వతీపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాల యంలో శుక్రవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి వినతులు స్వీకరించారు. వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు పలు సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన సీఆర్‌టీలకు ప్రాధాన్యమివ్వాలి

పార్వతీపురం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): గిరిజన సీఆర్‌టీలకు తొలి ప్రా ధాన్యమివ్వాలని ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్య దర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఐటీడీఏలో జరుగుతున్న సీఆర్‌టీల నియా మకంలో గిరిజనులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పీవోను కలిసిన వారిలో కమిటీ సభ్యులు కద్రక చిన్నారావు, సీఆర్‌టీలు వెం కటరావు, వివేక్, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో ముగ్గురికి అస్వస్థత

సీతంపేట రూరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): కొండపోడు పనులు చేస్తుండగా పొంజాడ, బుడగరాయి, బి.ముత్యాలు గ్రామాలకు చెందిన సవర సుభాషిణి, సవరలక్ష్మి, సవర గంగమ్మలను శుక్రవారం పాము కాటేసింది. దాంతో వారు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను కుటుంబసభ్యులు 108 వాహనంలో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏరియా ఆసుపత్రిలో వారి ముగ్గురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

కత్తితో యువకులపై దాడి

పాలకొండ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో కత్తితో శుక్రవారం ఇద్దరు యువకులపై ఓ యువకుడు దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు పాలకొండ పట్టణానికి చెందిన పొట్నూ రు రాము, కోటిపల్లి గ్రామానికి చెందిన గొర్లె ప్రదీప్ మధ్య మాటల యుద్ధం చెలరేగింది. ఈ క్రమంలోనే వారిద్దరు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. విచక్షణ కోల్పోయిన పొట్నూరు రాము.. గొర్లె ప్రదీప్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. దీనితో ఆయన పొట్టలో గాయమైంది. పక్కనే ఉన్న పాల కొండకు చెందిన యువకుడు మామిడి గణపతి అడ్డుకోవాలని ప్రయత్నించగా ఆ యువకుడికి చేతికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు ఆ యువకులను సరి చెప్పారు. గాయాలపాలైన ప్రదీప్, గణపతిలను ఏరియా ఆసుప త్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఏరియా ఆసుపత్రికి చేరుకుని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాముపై కేసు నమోదు చేశారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

వీరఘట్టం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల రెవెన్యూ కార్యా లయాన్ని కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాన్ని పరిశీలించి తహసీల్దార్ సాయి కామేశ్వరరావుకు పలు సూచనలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే తన అజెండా అని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. నియోజక వర్గంలోని ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయమన్నారు. ఇప్పటికే పింఛన్లు, ఇళ్లు, రోడ్లు, భూ సమస్యలు, విద్యుత్ సమస్యలు తదితర పలు సమస్యలను పరిష్కరించామని వివరించారు.

త్వరలో వంతెన ప్రారంభిస్తాం

సీతానగరం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం పరిశీలించారు. త్వరలో వంతెన ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భం గా వంతెన పనులపై సంబంధిత ఆర్అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన నిర్మాణం పనులు అతివేగంగా జరుగుతున్నాయన్నారు. పాత బ్రిడ్జి పాడవ్వడంతో రాకపోకలకు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వంతెన నిర్మాణం పనులను వేగవంతం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. పరిశీలనలో ఎమ్మెల్యేతో పాటు ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.

పార్టీ అభివృద్ధికి బాటలు వేయాలి

సీతానగరం (బలిజిపేట), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్య కర్తలు కలిసి కట్టుగా పనిచేసి పార్టీ అభివృద్ధికి బాటలు వేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. శుక్రవారం సాయంత్రం బలిజిపేటలోని కళింగ వైశ్య కల్యాణ మండపంలో నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో టీడీపీ కార్యాలయాలను ప్రారంభించాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మన అధినేత చంద్రబాబు నాయుడు పాటు పడుతున్నారన్నారు.

అసత్య ఆరోపణలు తగదు

● టీడీపీ నాయకుల ఆగ్రహం


దినపత్రికలను దహనం చేస్తున్న నాయకులు

సాలూరు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కుటుంబంపై సాక్షి దినపత్రికలో తప్పుడు కథనాలు, అసత్య ఆరోపణలు ప్రచురించడం తగదని టీడీపీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట సాక్షి దినపత్రికలను నాయకులు దహనం చేశారు. అనంతరం సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐ అప్పలనాయుడుకు ఫిర్యాదు చేశారు. అనంతరం టీడీపీ నాయకులు గుళ్ల వేణుగోపాలనాయుడు, నిమ్మాది తిరుపతిరావు, ముఖి సూర్యనారాయణ తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక తప్పుడు కథనాలు రాస్తున్నారన్నారు.

లక్కగూడలో మండల స్థాయి సమావేశం

గుమ్మలక్ష్మీపురం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): లక్కగూడలో శుక్రవారం మండల స్థాయి టీడీపీ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. మం డల పార్టీ అధ్యక్షుడు అడ్డాకుల నరేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశా నికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగదీశ్వరి హాజరయ్యారు. పార్టీ బలోపేతం, గ్రామస్థాయి సమస్యలు, రాబోయే స్థానిక ఎన్నికల కోసం కార్యాచరణ రూపకల్పన వంటి అంశాలపై మాట్లాడారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

వీరఘట్టం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని ఎరువుల దుకాణాల్లో ఏడీఏ జి.సత్యవతి శుక్రవారం తనిఖీలు నిర్వహిం చారు. ఉమామహేశ్వర అండ్ సన్స్, మన గ్రోమోర్ సెంటర్, సత్యనారాయణ సీడ్స్ షాపుల్లో రికార్డులు, స్టాక్ వివరాలు సరి చూశారు. తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి సౌజన్య ఉన్నారు.

పాలకొండకు విద్యాశాఖ కమిషనర్ రాక


కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పాలకొండ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.విజయ రామరాజు శుక్రవారం పాలకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి, పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆయనకు పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. జిల్లాలో విద్యావ్యవస్థ అమలు తీరు, విద్యాశాఖకు సంబంధించిన పథకాల పురోగతిని సమీక్షించేందుకు కమిషనర్ పాలకొండలో పర్యటనకు విచ్చేశారు.

పోలీస్ కుటుంబానికి ఆర్థిక సాయం

బెలగాం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ జి.మల్లేశ్వరరావు కుటుంబానికి రూ.75 లక్షల చెక్‌ను ఎస్పీ మాధవరెడ్డి అందజేశారు. శుక్రవారం పోలీస్ జిల్లా కార్యాల యంలో నిర్వ హించిన కార్యక్రమంలో ఎస్‌బీఐ శాలరీ ప్యాకేజీ ద్వారా మంజూరైన చెక్ బాధిత కుటుంబ సభ్యులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తున్న పోలీసు ఉద్యోగుల సంక్షే మాన్ని దృష్టిలో పెట్టుకుని, అందరికీ ఎస్‌బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజీని ప్రారం భించామన్నారు. ఈ ప్యాకేజీ ప్రయోజనంలో భాగంగా ఎవరైనా పో లీస్ ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబానికి రూ. కోటి, సాధారణం మరణం సంభవిస్తే రూ.10 లక్షల ఆర్థిక సాయం ఎస్‌బీఐ అందజేస్తుందన్నారు. విధి నిర్వహణలో మృతి చెంది న జి.మల్లేశ్వరరావు కుటుంబానికి ఆర్థికసాయం అందజేసినట్టు ఎస్పీ వివరించారు.

పీజీఆర్ఎస్‌కు 23 వినతులు

సీతంపేట రూరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఏపీవో జి.చిన్న బాబు 23 వినతులను స్వీకరించారు. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న తనకు ఐటీడీఏ ద్వారా ఆర్థిక సహాయం అందజేయాలని కె.హేమలత కోరిం ది. హౌసింగ్ బిల్లు కోసం ఎన్.లక్ష్మీకాంతం, ఆటో, మేకల రుణం అందిం చాలని లంగడుగూడ, పీవీ ఈతమానుగూడ గ్రామాలకు చెందిన సవర రాంబాబు, ఆరిక దాసు ఏపీవోను కోరారు. రాయిమానుగూడలో నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనం పూర్తిచేయాలని సవర శివకుమార్ విన్నవించారు. పీజీఆర్ఎస్‌లో ఏపీవోతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సస్పెన్షన్‌ను ఎత్తివేయండి

పాలకొండ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): బ్రీత్ అనలైజర్ మిషన్ తప్పు డు రీడింగ్ ఆధారంగా ఆర్టీసీ ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం తగదని నేషనల్ మజ్దూర్ యూనియన్ మన్యం జిల్లా కార్యదర్శి కె.శంకర రావు అన్నారు. శుక్రవారం పాలకొండ డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూమిషన్ల తప్పుడు రీడింగ్ వల్ల సస్పెండ్‌కు గురైన ఎం.వైకుంఠంను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. నిరసనలో డిపో కార్యదర్శి వావిపల్లి రాజేష్, పి.ఎల్.రావు, లక్ష్మి, పుణ్యవతి, ధర్మాంబ, సుజాత, రమణ, సుందరరావు, మురళీ, చంద్రరావు తదితరులున్నారు.

ప్రకృతి సాగువైపు నడవాలి

కురుపాం రూరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు నడవాలని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.టి.బాబూరావు నాయుడు సూచించారు. శుక్రవారం కొండబారికి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బాబూరావు నాయుడు రైతులతో ముఖాముఖీ అయ్యారు. రైతుల అను భవాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జట్టు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థా పకుడు డా. డి.పారినాయుడు, ప్రాజెక్ట్ మేనేజర్ మన్మోహన్ పాల్గొన్నారు.

వార్షిక బడ్జెట్ ఆమోదం

సీతానగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బిరవజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. బడ్జెట్‌ను ఆమోదించిన సభ్యులను ఎంపీపీ రవణమ్మ, ఎంపీడీవో ప్రసాద్ కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు మామిడి బాబ్జీ పాల్గొన్నారు.



రానున్న రోజుల్లో కాంగ్రెస్‌దే అధికారం


మాట్లాడుతున్న ఏఐసీసీ అబ్జర్వర్

పాలకొండ, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీదే అధికారమని ఏఐసీసీ అబ్జర్వర్ దేబాషిస్ పట్నాయక్ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ నేతలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు బిడ్డిక శ్రీనివాస్, పార్వతీ పురం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తిన మోహన రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్నా యక్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి సంస్థాగత నిర్మాణ ప్రక్రియ చేపట్టామని వివరించారు.

●గుమ్మలక్ష్మీపురం: కాంగ్రెస్ పార్టీ సామాన్య కార్యకర్త మొదలుకుని నాయకులు పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేయాలని ఏఐసీసీ అబ్జర్వర్ దేబాషిస్ పట్నాయక్ సూచించారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురం లోని పి.లేవడి వద్ద అరకు పార్లమెంట్ అధ్యక్షుడు శతాక బుల్లిబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నా రు. నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. పీసీ ఇన్‌చార్జి జగత శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణానికి తమ వంతు కృషి చేయడమే గాక విధేయతతో పనిచేసేవారికి పార్టీ పదవులు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రాధాన్య మిస్తామన్నారు. సమావేశంలో కురుపాం మం డల అధ్యక్షుడు మీసాల ఫ్రాన్సిస్, గుమ్మల క్ష్మీపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోలక జయరాం, కోలా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



